హైదరాబాద్ వార్త



# టికెట్‌పై మొదలైన రగడ

## గోషామహల్ నియోజకవర్గంలో అన్ని పార్టీలో ఇదే తీరు

గోషామహల్, అక్టోబర్ 13 ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో గోషామహల్ నియోజక వర్గంలో బిఆర్ఎస్, బిజెపి,కాంగ్రెస్ పార్టీ నేతల కుమ్ములాట జరుగుతుంది. ఇదే తంతూ కొన సాగుతుంది. సభలు, సమావేశాల్లోనూ తిట్ల పురాణం, ఎన్నికలు సమీపిస్తున్న వేళ వింత ధోరణి ఎప్పటి కప్పుడు స్కాన్ చేస్తున్న అధిష్టానాలు ఎన్నికల్లో టికెట్లపై ఎఫెక్ట్ చూపుతుంది. చివరకు బిఆర్ఎస్,బిజెపి,కాంగ్రెస్ పార్టీల నాయకులు నువ్వెంత,నీ లెక్కెంత ఇటీవల జరిగిన నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఏకి పారేశాడు. టిక్కెట్ నాకే ఖరారైందని ఏకంగా బంగా రు పల్లెనాన్ని తయారు చేసి సిద్ధం చేశాడు. 2018 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో ఏకకై ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన టి.రాజాసింగ్ ఏడాది క్రితం ఓ మతంపై టి.రాజాసింగ్ చేసిన వ్యాఖ్యాలు చివరికి బిజెపి కేంద్ర అధిష్టానం రాజాసింగ్‌ను పార్టీ నుంచి ఏకంగా సస్పెండ్ చేసి ఏడాదిన్నర అవుతున్నప్పటికి ఇప్పటి వరకు కేంద్ర బిజెపి అధిష్టానం రాజాసింగ్‌పై సస్పెండ్ ఎత్తి వేయలేదు.దీంతో టిక్కెట్ కోసం నలుగురు బిజెపి కార్పొరేటర్లు, జిల్లా గోల్కొండ జిల్లా అధ్యక్షులు,పాండుయాదవ్, ఎం.విక్రమ్‌గౌడ్‌తోపాటు బిజెపి సీనియర్ నాయకులు టిక్కెట్ కోసం ధరఖాస్తు చేసుకున్నారు.దీంతో నువ్వెంత.నీ లెక్కంత అంటూ జోరుగా అన్ని పార్టీలో నాయకులు తమ అనుచరుల వద్ద అనుకుంటున్నారు. బిఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జ నందకిషోర్‌వ్యాస్ ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లు తనకు టిక్కెట్ ఇస్తామని హామి ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. మిగత బిఆర్ఎస్ నాయకులు, మాజీ శాసనసభ్యులు ప్రేమ్‌సింగ్‌రాథోడ్,మాజీ మహిళా కార్పొరేటర్ తాను కూడా టిక్కెట్ రేసులో ఉందన్నారు.తాను ఉద్యమ నేత, బిఆర్ఎస్ నాయకులు ఆర్వీ మహేందర్‌కుమార్, ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్, గోషామహల్ నియోజక వర్గంలో బిఆర్ఎస్ నాయకులు మూకుమ్మడిగా పార్టీ లీడర్లంతా కలిసి కట్టుగా లేకుండా పోతున్నారు.ఇలా అన్ని పార్టీల్లోనూ అదే పార్టీలకు చెందిన నేతలే స్వయంగా ఒకరిపై ఒకరు కారాలు,మిరియాలు నూరు కోవడం అత్యంత అసక్తికరంగా మారింది. బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల అధిష్టానం ఎప్పుడు ఆయా పార్టీ అభ్యర్దులను ఖరారు చేస్తుందో వేచి చూడాల్సిందే. బయటి వ్యక్తులకు టిక్కెట్ కేటాయిస్తే తాము పని చేయమని చర్చించుకుంటున్నారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులకు కేటాయిస్తే మేము ఎందుకు పని చేయాలని అంటున్నారు.

## హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్య



హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త: హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్య నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా సందీప్‌శాండిల్య విధులు నిర్వహిస్తున్నారు. ఈసీ ఆదేశాలకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రం పంపిన ప్యానల్ నుంచి అధికారులను ఈసి ఎంపిక చేసింది. ఈమేరకు శనివారం సిపిగా బాధ్యతలు స్వీరించనున్నట్లు తెలుస్తుంది.

# ఇంకా తేలని ప్రత్యర్థులు

**అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బిజెపి**

**అయోమయంలో పార్టీల శ్రేణులు**

**దూసుకుపోతున్న బిఆర్ఎస్ అభ్యర్థులు**

**త్వరలో ప్రారంభం కానున్న నామినేషన్ల స్వీకరణ**



హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త : కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో నగరంలో రాజకీయ సందడి నెల కొంది. వచ్చే నెల మూడు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభంకానుంది. బిఆర్ఎస్ అభ్యర్థులు ప్రజల మధ్య ఉంటూ కార్యక్రమాలను నిర్వహిస్తూ దూసుకుపోతున్నారు. కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. ఎవరికి టికెట్ ఇస్తారో నని ఆయా పార్టీల కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. నామినేషన్ల స్వీకరణ తేదీ ప్రకటించినా అభ్యర్థులను ప్రకటించలేదు. ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న ఆశావహులు తమ మద్దతుదారులను కూడగట్టుకుని కేంద్ర రాష్ట్ర నాయకత్వం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కొందరైతే ఢిల్లీలో మకాం వేసి అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. కాగా ఇప్పటికే టికెట్లు దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు జనంలోకి వెళ్లారు. ఈ అభ్యర్థులను ఢీకొని గెలవగల ప్రత్యర్థులెవరు? ఎక్కడి నుంచి ఎవరెవరు పోటీ చేయనున్నారు అన్నది ప్రస్తుతం నగరంలో ఆసక్తికరంగా మారింది.సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోసారి బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. బిజెపి నుంచి మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కోట నీలిమ, డాక్టర్ రవీందర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డిలు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఏ పార్టీ నుంచి ఎవరు పోటీచేసినా తలసానికే గెలుపు అవకాశాలెక్కువనే అభిప్రాయాలున్నాయి. దశాబ్దాల కాలంగా ఉన్న రాజకీయ అనుభవం, నియోజక వర్గంలో చేసిన పనులు, ప్రజలతో కలిసిపోవడం, ఇతరత్రా అంశాలు ఆయనకు కలిసివచ్చేవిగా ఉన్నాయి. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్ పోటీ చేస్తుండగా, బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులెవరన్నది చెప్పే పరిస్థితి లేదు. ఇక్కడ పద్మారావుగౌడ్‌కు ప్రజలతో కలిసిపోయేతత్వం కారణంగా బిఆర్ఎస్ విజయానికి ఢోకాలేనప్పటికీ ప్రత్యర్థి పార్టీల నుంచి బలమైన, ప్రభావం చూపగల నేతలు రంగంలో దిగితే మాత్రం పరిస్థితి క్లిష్టంగా మారనుంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి నోముల ప్రకాశ్‌రావు, ఆదం సంతోష్‌కుమార్, నాగులూరి సాయిబాబా, బిజెపి నుంచి బండ కార్తీకరెడ్డి, మేకల సారంగపాణి, ఆదం విజయ్‌కుమార్, మద్దెర్ల శ్యాంసుందర్‌లు టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన కంటోన్మెంట్‌లో దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్యనందితకు బిఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా ఇటీవల మరణించిన ప్రజాగాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలను రంగంలో దింపనున్నట్లు తెలుస్తోంది. బిజెపి నుంచి మాజీ మంత్రి శంకర్ రావు కుమార్తె, వివేక్ వెంకటస్వామి మేనకోడలు సుష్మితను రంగంలోకి దింపే యోచనలో ఉన్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ నుంచి మాగంటి గోపినాథ్ బిఆర్ఎస్ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి మాజీ క్రీడాకారుడు, మాజీ ఎంపి అజారుద్దీన్, పిజెఆర్ కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డిలలో ఒకరికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చే అవకాశాలున్నాయి. బిజెపి నుంచి వీరపనేని పద్మ, లంకల దీపక్‌రెడ్డిలు టికెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ ఎంఐఎం కూడా అభ్యర్థిని పోటీలో పెట్టె అవకాశాలు లేకపోలేదు. గోషామహల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆపార్టీ సస్పెండ్ చేసింది.అయితే ఆయన సస్పెండ్‌ను ఎత్తివేసి ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే అవకాశాలు లేకపోలేదు.ఆయనకు టికెట్ ఇవ్వనిపక్షంలో మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్, భగవంతరావులలో ఒకరికి టికెట్ వచ్చే అవకాశాలున్నాయి. బిఆర్ఎస్ నుంచి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు టికెట్ దాదాపుగా ఖాయమైంది. ముషీరాబాద్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బిఆర్ఎస్ అభ్యర్థికాగా, కాంగ్రెస్ నుంచి అంజన్ కుమార్ యాదవ్, బిజెపి నుంచి గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారి విజయలక్ష్మీకి టికెట్ దక్కే అవకాశాలున్నాయి. అంబర్‌పేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బిఆర్ఎస్ అభ్యర్థి కాగా, బిజెపి నుంచి కేంద్ర మంత్రి,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి నూతి శ్రీకాంత్‌గౌడ్‌లు బరిలో దిగనున్నట్లు తెలుస్తోంది. ఖైరతాబాద్ నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ కాగా, కాంగ్రెస్ నుంచి రోహిణ్‌రెడ్డి, విజయరెడ్డిలు టికెట్ ఆశిస్తున్నారు. బిజెపి నుంచి చింతల రామచంద్రారెడ్డి పేరు దాదాపు ఖాయమైనట్లు ప్రచారం జరుగుతోంది.కాగా బిఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతుండగా, టికెట్ ఖరారుకాని బిజెపి, కాంగ్రెస్ పార్టీల శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

## శేరిలింగంపల్లిలో నకిలీ మద్యం పట్టివేత
## అంతరాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్

శేరిలింగంపల్లి, అక్టోబర్ 13 ప్రభాతవార్త : కల్తీమద్యం కొత్తసీసాలకు ఎక్కుతోంది. విదేశీ కంపెనీలకు చెందిన లిక్కర్ సీసాలలో తక్కువ ధర ఉన్న మద్యం కలిపి కొందరు కేటుగాళ్లు అమ్మేస్తున్నారు.మీరు తాగే మద్యం.. అసలుదా.. నకిలీదా.. తెలిసేసరికి కల్తీరాయుళ్లు తమ జేబులు నింపుకుని గుట్టు చప్పుడు కాకుండా రాష్ట్రాలు దాటేస్తున్నారు. అక్రమంగా మద్యాన్ని కల్తీచేస్తూ సొమ్ము చేసుకుంటున్న ఒడిసా రాష్ట్రానికి చెందిన ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్‌చేశారు. శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులు భారీగా తనిఖీలు చేస్తుండగా నకిలీ మద్యం బయటపడింది. ఖరీదైన స్కాచ్ బాటిళ్లలో తక్కువ దర మద్యం కలిపి అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న ఘరానా దొంగలను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 52 ఫుల్ బాటిళ్ల,పలు విదేశీ కంపెనీ లకు చెందిన మరో 55 నకిలీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందులు సంజయ్‌సాహు,మలయపాత్రో, సంగ్రామ్ బరన్‌లుగా ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. నగరంలో పలు పబ్‌లు, ప్రైవేటు ఈవెంట్లలో పనిచేసే బార్ సిబ్బంది నుంచి ఖాళీ మద్యం బాటిళ్లను సేకరిస్తున్నారని, ఈ బాటిళ్లలో తక్కువ ధర మద్యాన్ని నింపి అమ్ముకుంటున్నారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

## 5265 టిఎస్ ఆర్టీసీ అదనపు బస్సులు

బేగంబజార్, అక్టోబర్ 13ప్రభాతవార్త: దసరా పండుగ సందర్భంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ నుంచి వివిధ రాష్ట్రాలకు, వివిధ జిల్లాలకు ఈనెల 13వ తేది నుంచి 25వ తేది వరకు 5265 టిఎస్‌ఆర్‌టిసి అదనపు బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియనల్ మేనేజర్ ఎ.శ్రీధర్ తెలిపారు.ఈమేరకు గురువారం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఆర్‌టిసి, ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.ఈసమావేశంలో సుల్తాన్ బజార్ ఎసిపి సంపత్‌కుమార్,చంద్రాయణగుట్ట ఎసిపి సత్యనారాయణ, చార్మినార్ ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐలు రాంబాబు,ఆర్‌టిసి డిప్యూటి రీజినల్ మేనేజర్లు,విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## ఆశావహులు 10వేలు కట్టి బి ఫామ్ పొందండి : కెఏ పాల్



బీ ఫామ్ అందజేస్తున్న కెఏ పాల్

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త : టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు అందరూ రూ.10వేలు కట్టి బి ఫామ్ పొందాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఏ పాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలవదని, బానిస బతుకు వద్దు అంటూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సూచిస్తూ తమ ప్రజాశాంతి పార్టీలో చేరాలని ఆహ్వానించారు. దానం నాగేందర్, తాతమధు ఎలక్షన్ కమీషనర్‌కు వార్నింగ్ ఇస్తున్నారని, అంతే కాకుండా గులాబీ జెండా మోసే వాళ్ళకు తప్పా వేరే వాళ్లకు డబల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వమని బెదిరిస్తున్నారని తెలి పారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎక్కడుం దని, మునుగోడు, హుజురాబాద్‌లో డిపాజిట్లు కూడా రాలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజెపి అసలే లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ అధికారంలోకి రాను న్నదని, ప్రజలంతా తమకే మద్దతు తెలుపుతున్నారని అన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



వెంగళ్‌రావునగర్ శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినిలు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 13, ప్రభాతవార్త : వెంగళ్‌రావునగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి హైస్కూల్ వద్ద బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారులు, ఉపాధ్యాయులు రంగురంగు పూలతో బతుకమ్మను అలంకరించి సాంస్కృతిక పాటలను నృత్యాలు చేస్తూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కొల్లి లక్ష్మణ రావు మాట్లాడుతూ చదువుతో పాటు పండుగ పర్వదినాల ప్రత్యేకతను తెలియచేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుకుమార్, కృష్ణవేణి, గీత, నిర్మల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# ఆంధ్ర ప్రదేశ్ పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలి

**అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ యట్ హైదరాబాద్ నాయకులు**



నిరసన తెలుపుతున్న అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ యట్ హైదరాబాద్ నాయకులు

ధర్నాచౌక్, అక్టోబర్ 13, ప్రభాతవార్త: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పెన్షనర్ల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యం వీడాలని, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ యట్ హైదరాబాద్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ యట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో పెన్షనర్ల ఆవేదన పేరుతో ధర్నా చేపట్టారు. ఈ ధర్నా నుద్దేసించి అసోసియేషన్ అధ్యక్షులు కే.నళిని మోహన్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ వృద్ధాప్యంలో ఉన్నందున వైద్య ఖర్చులు అధికంగా ఉంటాయని, ప్రతి నెలా పెన్షన్ కోసం ఎదురుచూస్తూ ఉండవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఒకటో తారీఖున పెన్షన్ చెల్లించాలని 2018 నుండి పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.ఎం.బి.బుచ్చిరాజు మాట్లాడుతూ గత నెలలో సూపర్ సీనియర్లకు తగ్గించిన అడిషనల్ క్వాంటం పై డీఆర్‌ను వెంటనే కలపాలని, జఅవో నెంబర్ 67 ప్రకారం సెప్టెంబర్‌లో ఇస్తామన్న డీఆర్ అరియర్స్ మొదటి వాయిదాను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.వి.జనార్ధనరావు, బి.రవీంద్రనాథ్, డి.మీరం శెట్టి, వి.చిన్నా రెడ్డి, వి.ఎస్.భార్గవ్, రాఘవేంద్రరావు, ఎస్.జమీర్ అహ్మద్, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన బతుకమ్మ ఊరేగింపు ప్రారంభం



గన్‌పార్కువద్ద బహుజన బతుకమ్మలతో విమలక్క

సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: మద్యం మత్తును చిత్తు చేస్తూ-స్త్రీలపై అఘాయిత్యాలను ఎదిరిస్తూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క నేతృత్వంలో శుక్రవారం గన్‌పార్కులో అమరు వీరుల స్థూపం వద్ద బహుజన బతుకమ్మను పూల కవాతుగా-స్త్రీల కవాతుగా ఊరేగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆనేక మంది మహిళలు పూలతో అమర్చిన బతుకమ్మలను తీసుకువచ్చి స్థూపం వద్ద వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ రాష్ట్రంలో బహుజన బతుకమ్మను ఊరేగించుకుందామని, ఈ నెల 22వ తేదీ వరకు వివిధ ప్రాంతాలలో ఊరేగింపులు నిర్వహిస్తున్నామని, బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు ఉద్యమంటూ చాటుదామని పిలుపునిచ్చారు. ఆట, పాటల ద్వారా బహుజన బతుకమ్మ ఊరేగించుకుందామన్నారు.

# ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు

**రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి**

చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త: ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. శుక్రవారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సుద్దాల హనుమంతు-జానకమ్మ కళాపీఠం, సుద్దాల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అరుణోదయ విమలక్కకు సుద్దాల హనుమంతు-జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పురస్కారాన్ని ప్రదానం చేసిన అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజాకవిగా, కవిగా, కళాకారుడిగా, అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితమంతా కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం అంకితం చేసిన వ్యక్తి అని అన్నారు. ప్రజానటులు, నిర్మాత, దర్శకులు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను దిక్కరించడానికి, ప్రజలను మేల్కొలపడానికి, ప్రజా వాగ్గేయకారుడు సుద్దాల హనుమంతు చేసిన కృషి నేటికి ప్రజలు మరిచిపోలేదని అన్నారు.

## బిజెపి, కాంగ్రెస్‌ను ఓడించాలి

సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: ఆరు దశాబ్దాలు, ఒక దశాబ్ధంగా దేశ ప్రజలను మోసం చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు వచ్చే ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి పి.వెంకటరాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం నాడిక్కడ పార్టీ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం సంస్థలను అమ్ముకుంటున్నదని, అన్ని రకాల వస్తువుల ధరలను విపరీతంగా పెంచేసిందని ఆరోపించారు.

# ప్రకృతిని పలుకరించే బతుకమ్మ

**నేటి నుంచి బతుకమ్మ సంబురాలు మొదలు**

**బతుకమ్మ పండుగ కథ..** మొదటి కథ-పూర్వం ఒక బాలిక భూస్వాముల ఆకృత్యాలకు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. దాంతో ఈ ఊరి ప్రజలు ఆమెను చిరకాలం 'బతుకమ్మ' అనే పేరుతో దీవించారట. అప్పటి నుంచి మొదలైన ఈ జాతర నాటికి అమలులోనే ఉంది. స్త్రీలు ఈ పండుగ సందర్భంగా తమకు ఎటువంటి ఆపదలు రాకూడదని, తమ భర్తలు-కుటుంబం చల్లగా ఉండాలని గౌరవమ్మను ఎంతో దైవంగా ప్రార్థిస్తారు.

**రెండవ కథ..** పూర్వం దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళ చక్రవర్తి ధర్మంగదుడు అనే రాజుకు సంతానంలేక పోవడంతో ఆయన అనేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. దాంతో అతని భార్య అయి లక్ష్మీదేవి అనుగ్రహంతో ఒక అమ్మాయి జన్మించింది. పసిబిడ్డయిన లక్ష్మీ అనేక గండాలతో గట్టెక్కించి కాబట్టి ఈమె తల్లి దండ్రులు ఆమెను 'బతుకమ్మ' అనే పేరును నామకరణం చేశారు. అప్పటి నుంచి యువ వయస్సులో ఉన్న అమ్మాయిలు తమకు మంచి భర్త ప్రసాదించాలని కోరుతు బతుకమ్మ పండుగను నిర్వహించుకోవడం జరిగింది.

చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త: నీలాకాశాన్ని సిబ్బిగా మలచి సింగిడిని పూల వరుసలుగా పేర్చి ప్రకృతిని దేవతగా పూజించే పండు బతుకమ్మ. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణకే ప్రత్యేకమైన రంగురంగుల పూలపండుగ ఇది. బతుకమ్మ అంటే బతుకుదెరువును మెరుగు పరిచే అమ్మ అని అర్థం. ప్రకృతి నుంచి సేకరించిన పూలను తిరిగి ప్రకృతికే సమర్పించడం బతుకమ్మ పండుగ విశిష్టత. విభిన్నమైన పూలతో బతుకమ్మను చేసి, పూజించి తెలంగాణ ఆడపడుచులు ఆనందోత్సాహాలతో, సంప్రదాయంగా, వేడుకగా జరుపుకునే పూల పండుగ ఇది. తొమ్మిది రోజుల పాటు హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ జిల్లాల్లో ఒక జాతరలాగా సాగే ఈ పండుగ మన వాకిట్లో బతుకుతెరువును ఆవిష్కరిస్తోంది. ఆటపాటలతో మనల్ని సేద తీరుస్తుంది. జీవన సంబురాన్ని ఆవిష్కరిస్తుంది. తెలంగాణ సాంస్కృతిక జీవన వైవిధ్యం ఇతర ప్రాంతాలకు భిన్నం. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా కేవలం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే పరిమితమైన పండుగ బతు కమ్మ పండుగ. వర్షాకాలం ముగిసి జలవనరులు సమృద్ధిగా నిండి, పూలు బాగా విసించే కాలంలో బతుకమ్మ పండుగ వస్తుంది. తంగేడు, గునుగు, కట్ల, గుమ్మడి, గన్నేరు, రుద్రాక్ష, బంతి, చేమంతి, బీర, కాకర వంటి పూలతో బతుకమ్మలను అందంగా పేర్చుతారు. పేర్చిన పూలమధ్య, గుమ్మడి పూజల మధ్యలో ఉండే పుప్పొడి లేదా పసుపు ముద్దను (గౌరీదేవిని) వేంచేపుచేసి, పక్క మట్టి ప్రమిదలో దీపాన్ని, ఆగరవత్తులను వేలిగించి పూజిస్తారు. బతుకమ్మ పండుగన్ని రోజులు నగరంలోని వివిధ ప్రాంతాలలు పూలవనాలవుతాయి. ఎంగిలిపూల బతుకమ్మతో తెలంగాణ అంతటా పండుగ మొదలవుతోంది. ప్రకృతితో మమేకమై ఆటపాటలతో, ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకుంటారు. పండుగ నాటికే ప్రకృతి అంతా పూలవనంగా మారుతుంది. ప్రకృతిలో సేకరించిన పూలను ప్రకృతికే సమరిపంచడం అనే ఉద్దేశ్యంతో బతుకమ్మలను నీటిలో విడిచి పెడుతారు.

బతుకమ్మ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, పాట కూడా. పాటలేని పండుగను ఊహించలేం. అందుకే ఈ పాటల పుస్తకం, అయితే, పాటన్నీ తెలంగాణ బిడ్డల కష్టసుఖాల కలబోతగా చెప్పవచ్చు. చరిత్ర, సంస్కృతిల మేలు కలయికగా పేర్కొనవచ్చు. ఒక పరంపరా గతంగా అందుతున్న అపూర్వ నిధిగానే దీనిని భావించాలి. బతుకమ్మ పండుగ అంటేనే ఒక సంబురం. ఏ పండుగకు కలవకున్నా ఈ పండుగకు చిన్ననాటి స్నేహితులంతా కలుస్తారన్న నమ్మకం. దీంతో ఆడపిల్లలు తప్పకుండా పుట్టింటికి వెళ్లడానికి ఆసక్తి చూపుతారు. అత్తగారింట్లో ఉండే ప్రతి ఆడపిల్లా ఎప్పుడు పుట్టింటికి వెళ్లానా, పుట్టింటి నుంచి పిలుపు ఎప్పుడు వస్తుందా, తనను తీసుకు వెళ్లడానికి పుట్టింటి వారు ఎప్పుడు వస్తారా అని తప్ప ఎదురుచూస్తుంటారు.

# వాహనాల తనిఖీల్లో 17 లక్షలు పైగా నగదు స్వాధీనం

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 13 ప్రభాతవార్త: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధి కళ్యాణ్‌నగర్ జంక్షన్ దగ్గర పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. బోరబండలో నివాసం ఉండే ముస్తఫా అలీ తన హోండా యాక్టివా బైక్ డిక్కీలో రూ.5 లక్షల నగదును తరలిస్తుండగా పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. సరైన ఆధారాలు చూపించక పోవడంతో ఎన్నికల నియమావళి ప్రకారం నగదును పోలీసులు సీజ్ చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఐ నారాయణ, ఏఎస్ఐ వసంతకుమార్, కానిస్టేబుళ్లు రవి, రాహుల్, లింగమూర్తి మరియు పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారని బోరబండ సీఐ కామల్ల రవికుమార్ తెలిపారు.

**ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తనిఖీల్లో నగదు స్వాధీనం**

**ధర్నాచౌక్..** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమీషన్ ఉత్తర్వుల మేరకు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు చేస్తున్న తనిఖీలలో 9.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ముషీరాబాద్ పోలీసులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీలలో షేక్ అన్సర్ అలీ, షేక్ అహ్మద్ అలీ అనే ఇరువురు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనంలో 9.5 లక్షల నగదు బయటపడింది. ఆ నగదుకు సంబంధించి సరియైన వివరాలు వారు ఇవ్వలేకపోవటంతో నగదు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

**40 లిక్కర్ బాటిల్స్ స్వాధీనం:** ముషీరాబాద్ పోలీసులు నిర్దిష్ట సమాచారం మేరకు శుక్రవారం బొంతలబస్తీలోని ఒక బెల్ట్ షాప్‌పై దాడి చేసి, తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీలలో అక్రమంగా అమ్మకానికి పెట్టిన 40 లిక్కర్ బాటిల్స్ బయ టపడటంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని రేణుక అనే మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ జహంగీర్ యాదవ్ తెలిపారు.

**మలక్‌పేట..** పోలీసుల తనిఖీలో రూ. 2.76 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి కథనం ప్రకారం రాత్రి మలక్‌పేట ఫైర్ స్టేషన్ వద్ద ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహ్మద్ మిసాబుద్దీన్ తన వాహనంలో రూ. 2.76 లక్షల నగదును తీసుకువెళుతుండగా పోలీసులు గమనించి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రూ. 50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకువెళితే దానికి సంబంధించిన ధృవ పత్రాలను చూపించాలని పేర్కొన్నారు.

## ఇద్దరు రౌడీషీటర్లపై బైండోవర్

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 13, ప్రభాతవార్త : బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సంజయ్‌నగర్‌కు చెందిన అలీ అహ్మద్, కార్మికనగర్‌కు చెందిన నిజాముద్దీన్‌లు రౌడీషీటర్లుగా ఉన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంచనీయ ఘటనలు పాల్పడకుండా ఉండేందుకు నాంపల్లి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేయటం జరిగిందని బోరబండ సీఐ కె.రవికుమార్ తెలిపారు.

## 300 మంది యువత బిఆర్ఎస్‌లో చేరిక



యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని పోచమ్మబస్తీ మహవీర్ అసోసియేషన్‌కు చెందిన 300 మంది యువత ఎ.వంశీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడిక్కడ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులైన యువత పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్‌లో చేరిన వారిలో సత్యనారాయణ, డి.వెంకటకృష్ణారెడ్డి, డి.మహేందర్‌రెడ్డి, టి.సత్యనారాయణరాజు, యాదయ్య, పి.బాలయ్య, ఎల్.రాంచందర్, జి.సత్యనారాయణ, రసోల్, ఎ.సరోజ, ఎ.నరేందర్, ఎ.శ్యామల, సుజాత, సుమిత్ర, డివి లక్ష్మి, డి.మానస తదితరులు పాల్గొన్నారు.

## లాస్యనందితను అధిక మెజారిటీతో గెలిపించాలి

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన లాస్యనందిత ఇతర నేతలు

కంటోన్మెంట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త : సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితను భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు నిచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జిగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రకటించిన సందర్భంగా శుక్రవారం బోర్డు మాజీ సభ్యులతో కలిసి లాస్య నందిత మంత్రి శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లి లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం దివంగత ఎమ్మెల్యే జి. సాయన్న ఎంతో కృషి చేశారని చెప్పారు. నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ విశేష సేవలు అందించారని అన్నారు. తాజాగా ఆయన కుమార్తె లాస్యనందితను అత్యంత మెజారిటీ గెలిపించడం మనందరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యాక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, అనితా ప్రభాకర్, నళినికిరణ్, పాండుయాదవ్, భాగ్యశ్రీ, శ్యాంకుమార్, లోకనాథం, ఆకుల హరికృష్ణ, టీఎన్ శ్రీనివాస్, సంతోష్‌యాదవ్, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ దేవాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న దేవాలయ వ్యవస్థాపకులు, దేవాలయ ఈవో తదితరులు

ధర్నాచౌక్, అక్టోబర్ 13, ప్రభాతవార్త: లోయర్ ట్యాంక్‌బండ్ పై నున్న కనకాల కట్ట మైసమ్మ దేవాలయంలో ఈనెల 15 నుండి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నాయని దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఛైర్మన్ జి.గౌతమ్ కుమార్ పటేల్ తెలిపారు. శుక్రవారం ఆయన దేవాలయ ఈవో వి.ఎన్.వి. సత్యనారాయణ, ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మలతో కలసి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కట్టమైసమ్మ అమ్మవారు ఎంతో మహిమ కలిగినదని, అమ్మవారికి ప్రతి సంవత్సరం విశేషంగా జరిగే ఉత్సవాలలో ఒక్కటైన దసరా ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15 న ప్రారంభమయ్యే ఈ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 23వ తేదీతో ముగుస్తాయని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారికి ప్రతి నిత్యం పంచామృత అభిషేకంతో ప్రారంభం అయి, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, సహస్ర నామార్చనలు, అన్న ప్రసాద వితరణ, ద్వారబందనము తదితర కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని వివరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో అర్చకులు రాజేష్‌శర్మ, ఆలయ సిబ్బంది సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో కాంగ్రెస్‌దే విజయం

**నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్యే రూబీ మనోహర్**



రూబీ మనోహర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త : ఖైరతాబాద్ కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే ఖైరతాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ విజయం సాధించడం తథ్యమని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహర్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో మెజార్టీ స్థానాలు సాధించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సింగిరెడ్డి రోహిన్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ బ్లాక్, డివిజన్ అధ్యక్షులు రూబీ మనోహర్‌ను గాంధీభవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రూబీ మనోహర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కుటుంబ అవినీతి పాలన పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అప్రమ త్తంగా ఉండాలని, అధిష్టానం ఇచ్చిన 6 సూత్రాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో పాటు జూబ్లీహిల్స్, సోమాజీగూడ, బంజారాహిల్స్, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్‌ల అధ్యక్షులు కాటూరి రమేష్, కె.నరేష్, జి.రాజు, కె.వెంకట్, నయీమ్ ఏబ్లాక్ అధ్యక్షులు సుఖదేవ్ తదితరులు రూబీ మనోహర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

## బిఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిప్పికొడతారు

**బిజెపి భరోసా పాదయాత్రలో మాధవరం కాంతారావు**



పాదయాత్రలో భాగంగా స్థానికులతో మాధవరం కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 13, ప్రభాతవార్త : మరోసారి మోదీ సర్కార్ ఈ సారి తెలంగాణలో బిజెపి సర్కార్ అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కెసిఆర్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ శుక్రవారం కెపిహెచ్‌బి కాలనీ 9వ ఫేస్‌లో బిజెపి భరోసా పాదయాత్రలో కూకట్‌పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జీ మాధవరం కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని వర్షాకాలంలో ప్రధాన రోడ్లపై నీరు నిలువ ఉండడం రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. డ్రైనేజీ, సానిటరీ శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఓవైపు ప్రజలు కనీస మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతుంటే, కూకట్‌పల్లి శాసనసభ్యులు కబ్జాలు, సెటిల్మెంట్ పనుల్లో తన పనితనం చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరారవు, బిజెపి నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్, ఎస్.ప్రీతంరెడ్డి, జిల్లా సెక్రటరీ సుగుణచౌదరి, డివిజన్ అధ్యక్షులు గంధం రాజు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, మహిళా మోర్చా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

## దత్తాత్రేయ కుటుంబానికి అండగా ఉంటాం: బిల్డర్ ప్రవీణ్



దత్తాత్రేయ కుమార్తెకు ఆర్థిక సహాయం అందజేస్తున్న టిడిపి సీనియర్ నాయకుడు బిల్డర్ ప్రవీణ్

హైదరాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త : సీనియర్ జర్నలిస్టు దత్తాత్రేయ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బిల్డర్ ప్రవీణ్ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన జర్నలిస్టు దత్తాత్రేయ చిన్న కుమార్తె హారిణి రష్యాలో మెడిసిన్ విద్యాభ్యసం పూర్తి చేయడానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలోని టిడిపి కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బిల్డర్ ప్రవీణ్ మాట్లాడుతూ దత్తాత్రేయతో తనకు మంచి పరిచయం ఉందన్నారు. నిరంతరం వార్తల సేకరణలో ఆయన ముందుంటూ క్రమశిక్షణతో పనిచేసేవారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ కుమార్తెను ఆశీర్వదిస్తూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యురాలుగా అన్ని వర్గాల ప్రజల మన్ననలను పొందాలని పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాల కొనసాగింపు నిరంతర ప్రక్రియ

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్**




ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి విజయ దుందుభి మోగించడం తథ్యమని ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ అన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే బిఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. శుక్రవారం ఫిల్మ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బూత్, డివిజన్‌ల కార్యకర్తల సమావేశంలో దానం నాగేందర్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగుతాయని, ఇది నిరంతర కార్యక్రమమని, ఎవరు నిరాశపడవద్దని కార్యకర్తలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సలహాలు, సూచనలను అడిగి తెలుసుకుని, పలు సందేహాలకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సమాధానం ఇచ్చారు. షాదిముబారక్ లాంటి సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందని ఎమ్మెల్యే దానం గుర్తు చేశారు.

## దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

ఖైరతాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: ఖైరతాబాద్‌లోని బస్తీల, కాలనీలలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకునేందుకు ఇటు పెద్దలు, పలు సేవా సంస్థల, అసోసియేషన్ల వారు మరోవైపు స్థానిక దేవాలయాలు అంతా సిద్దదం అయ్యాయి. అమ్మవార్ల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు షెడ్లు సిద్ధం చేశారు. ఎక్కడ చూసినా దుర్గామాత విగ్రహాలు ఏర్పాటుకు స్థానికంగా యువకులు సిద్ధమవుతున్నారు. రెండు అడుగుల నుంచి ఐదడుగుల వరకు విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం పూజలతో రోజుకో అలంకారంతో అమ్మవార్లను అలంకరణ నిర్వహించడం జరుగుతుందని అర్చకులు పేర్కొన్నారు. రోజుకో అవతారంతో అమ్మవార్లను అలంకరించనున్న నేపథ్యంలో భక్తుల సంఖ్య బారులు తీరనుంది.

## అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓరుగంటి వెంకటేశ్వర్లు



వెంటేశ్వర్లుకు నియామకపత్రం ఇస్తున్న మహేష్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా యాదవులు, ఓబిసిల సంక్షేమం కోసం కృషి చేస్తున్న అఖిలభారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓరుగంటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ జాతీయ అధ్యక్షులు మహేష్‌యాదవ్ వెంకటేశ్వర్లకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా మహేష్‌యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహాసభ కార్యవర్గ నిర్మాణం చేసుకుందని తెలిపారు. అధ్యక్షు డిగా వెంకటేశ్వర్లుతోపాటు మహిళా ప్రధాన కార్యదర్శిగా కరాటే కళ్యాణి, తెలంగాణ రాష్ట్ర మీడియా ఇంచార్జ్ గా మేడిపల్లి రఘునాథ్ యాదవ్, న్యాయ సలహాదారులుగా నాగుల శ్రీనివాస్ యాదవ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అన్నా రాంచంద్రయాదవ్, వెంగల్‌రావు యాదవ్, నరేందర్ యాదవ్, కుమార్ చౌదరి యాదవ్ పాల్గొన్నారు.

## సంస్కృతి అద్దంపట్టే విధంగా బతుకమ్మ



వివేకానంద్‌నగర్‌లో శ్రీసాయి చైతన్య పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 13, ప్రభాతవార్త : తెలంగాణ సాంస్కృతి అద్దంపట్టే విధంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవటం జరుగుతుందని శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ ఎమ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వివేకానంద్‌నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. పాఠశాలలోని విద్యార్థినిలు, ఉపాధ్యాయులు తెలంగాణ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

## అందరు కలిసికట్టుగా గెలుగే లక్ష్యంగా పనిచేయాలి: రావుల శ్రీధర్‌రెడ్డి




ఉప్పల్ నియోజక వర్గం ఎలక్షన్ ఇంచార్జి రావు శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న అభ్యర్థి బిఎల్ఆర్

నాచారం, అక్టోబర్ 13 ప్రభాతవార్త: నిత్యం ప్రజల కోసం పనిచేసే నాయకుడు బిఎల్ఆర్ గెలుపు కోసం అందరు కలిసికట్టుగా గెలుగే లక్ష్యంగా పనిచేయాలని ఉప్పల్ నియోజక వర్గం ఎలక్షన్ ఇంచార్జి, తెలంగాణ రాష్ట్ర విద్యా, సంక్షేమం, మౌళిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. నాచారంలోని ఉప్పల్ నియోజక వర్గం పార్టీ కార్యాలయంలో ఇంచార్జిగా వచ్చిన రావుల శ్రీధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థి బిఎల్ఆర్ ఆయనను శాలువాకప్పి సత్కరించారు. అనంతరం రావుల మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్దిని ప్రజలకు వివరించాలని సూచించారు. నియోజక వర్గంలోని డివిజన్ల నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలని అభ్యర్థి చేసిన సేవలను ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పది డివిజన్ల నాయకులు ఆయనను పరిచయం చేసుకొని అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 15నుంచి 24వరకు దాండియా ఉత్సవాలు

హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త: దసరా పండుగ నేపథ్యంలో ఈనెల 15నుంచి 24వరకు నగరంలోని గచ్చిబౌలి ఫ్లిప్‌సైడ్ అడ్వెంచర్ పార్క్‌లో 10రోజులపాటు దాండియా నైట్స్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో నటి సెచల్ మాండవియా, హైదరాబాద్ మోడల్స్ వ్యవస్థాపకులు వంశీపల్లె, నటినవీన, ఏ1కాస్టింగ్‌హౌజ్ వ్యవస్థాపకులు మధు, డిజేబ్లాక్, డిజెడైంటీ పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగ విశిష్టతను తెలుపుతూ పదిరోజులపాటు వేడుకల ను ఘ నంగా నిర్వహిస్తామన్నారు. డిజేసంగీతంతో రంగురంగుల దాండియా నృత్యాలు,లైవ్ మ్యూజిక్, విభిన్న రుచుల ఆహారం, ప్రముఖుల సందర్శనలు ఉంటాయన్నారు. దీనికి పిల్లలు,పెద్దలందరూ హాజరై పాల్గొనవచ్చునని తెలిపారు.

## కెసిఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారు

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని, మూడోసారి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

## పార్టీ ఎవరికీ టికెట్ ఇస్తే వారిని గెలిపించాలి

**మునిరత్నం నాయుడు**



పెద్దమ్మ ఆలయంలో పార్టీ శ్రేణులతో ప్రమాణం చేయిస్తున్న మునిరత్నం నాయుడు

మూసాపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త : ఎవరికీ టికెట్ ఇవ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది, టికెట్ ఇచ్చిన వారిని గెలిపించే బాధ్యత పార్టీ నాయకుల అందరిపై ఉందని, వ్యక్తిగత అభిప్రాయాలు, కోరికలను పక్కనపెట్టి, అధిష్టానం ప్రకటించిన అభ్యర్థులను గెలిపించాలని మునిరత్నం నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆశావాదులతో బిజెపి తరపున శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జిగా పనిచేస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు వినూత్నంగా దేవాలయంలో ప్రమాణం చేయించడం జరిగింది. ఈ ప్రమాణం ముఖ్య ఉద్దేశ్యం ఎవరికైనా బిజెపి టికెట్ రాని పక్షంలో పార్టీ మారకుండ, పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేయకుండా ఒక వినూత్న ఆలోచన చేసినట్లు కనిపి స్తుంది. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆశావాదులు అందరూ కలిసి పనిచేయాలని, టికెట్ ఎవరికి వచ్చిన ఎవరు పార్టీని వీడకుండా అందరూ కలిసికట్టుగా ఉండి భారతీయ జనతా పార్టీకి పని చేయాలని జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ గుడిలో ప్రమాణం చేయిచండం జరిగింది. ప్రమాణం చేసిన అభ్యర్థులు ఎవరూ పార్టీ మారకుండా ఉంటారని బిజెపి అభిమానులు ఆశిస్తున్నారు. ఒకసారి వారు చేసిన ప్రమాణాన్ని పరిశీలిస్తే.. నేను బిజెపి తరపున శేరిలిం గంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ పడుతున్నాను. ఈ ప్రమాణం చేసిన బిజెపి నాయకులు డాక్టర్ కొరదాల నరేష్‌తో పాటు గజ్జల యోగానంద్, రవి కుమార్ యాదవ్, ముప్వ సత్యనారాయణ, ప్రభాకర్ యాదవ్, రవీంద్ర రావు, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## రామాయణ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ




రామాయణ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న గోవింద్‌రాఠి,సోసైటి ప్రతినిధులు

బేగంబజార్, అక్టోబర్ 13 ప్రభాతవార్త: ప్రభాత వార్త: దేవిశరన్న నవరాత్రి ఉత్సవాల ను పురస్కరిం చుకుని ప్రతియేటా మాదిరి గానే ఈ యేడు కూడా రామాయణ 51వ మేళాను నిర్వహిస్తున్నట్లు మేళా చైర్మన్ గోవింద్‌రాఠి,ఎకానమిక్ కమిటి కార్యదర్శి జి.వి.రంగారెడ్డిలు తెలిపారు. అక్టోబర్ 15వ తేదిన ప్రారంభమై అక్టోబర్ 24వ తేదిన ముగిస్తాయన్నారు. ఉత్సవాలను రాజస్థాన్ ప్రగతి సమాజ్,ఎగ్జిబిషన్‌సోసైటి సంయుక్త ఆద్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అక్టోబర్ 15వ తేదిన ఘట్టస్థాపన,కవిసమేళ్మనంతో కార్యక్రమం ప్రారంభమవుతుందనా న్నరు. 18వ తేదినుంచి 22వ తేది వరకు ఎకానమిక్ కమిటి ఆద్వర్యంలో దాండియా కార్యక్రమం కొనసాగుతుందన్నారు.24వ తేదిన సమ్మిపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు,శ్రీరామచంద్రమూర్తి రాజ్యభిషేకం,అనంతరం రావణ దహనం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన వలసిందిగా కోరారు.ఈ సమావేశంలో రామాయణ్‌మేళా అధ్యక్షులు కమల్ నారాయణ అగర్వాల్, గిరిదార్‌డాగా ఎకానమిక్ కమిటి అధ్యక్షులు డాక్టర్ గంగాధర్‌రావు,ఎగ్జిబిషన్ సోసైటి కార్యదర్శి బి.హన్‌మంత్‌రావు,ఉపాధ్యక్షులు సత్యదేవ్,కన్వీనర్లు వినయ్‌కుమార్,మనోజ్‌జైస్వాల్, సుమిత్‌రాఠి,డాక్టర్ వంశీతిలక్, అదిత్యమార్గం,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

## 'తెలంగాణ వైద్యుల పోరం' ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో కరప్రతాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు జరుగుతున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లుం ప్రవీణ్ ఆధ్వర్యంలో పోటి పడుతున్న 'తెలంగాణ రాష్ట్ర వైద్యుల ఫోరం' ప్యానల్ ద్వారా పోటి చేస్తున్న డాక్టర్లును గెలిపించాలని వైద్యుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మల్లుం ప్రవీణ్, డాక్టర్ చీమా శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఈ ప్యానల్‌లో డాక్టర్ లింగంగౌడ్, డాక్టర్ చీమా శ్రీనివాస్, డాక్టర్ ఐలయ్యయాదవ్, డాక్టర్ సిఆర్‌కె ప్రసాద్, డాక్టర్ ఆవుల మురళీధర్, డాక్టర్ పి.వి.సత్యనారాయణ, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉమాకాంత్ గౌడ్, డాక్టర్ చీకోటి సంతోష్, డాక్టర్ ముప్వా రామారావు, డాక్టర్ వసంత పోటి చేస్తున్నారని, మొత్తం 49 వేల మంది వైద్యులు ఓటర్లుగా ఉన్నారని, వీరంతా తమ ప్యానల్‌లోని డాక్టర్లుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాము విజయం సాధిస్తే ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేస్తామని, అధునిక వసతులతో నూతన మెడికల్ కౌన్సిల్ భవనాన్ని నిర్మిస్తామని, నకిలీ వైద్యుల వ్యవస్థ లేకుండా అరికడతామని, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి సేవలు అందిస్తామన్నారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టుపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**బిజెపి, బిఆర్ఎస్, టిడిపి నేతలు**



మాట్లాడుతున్న బిజెపి, టిడిపి, బిఆర్ఎస్ నేతలు

చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును రాజకీయ కక్షలో భాగంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్రమంగా ఇరికించి అరెస్టు చేసిజైలుకు పంపి బెయిల్ రాకుండా న్యాయవ్యవస్థను ప్రభావితం చేసే విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలని బిజెపి,టిడిపి, బిఆర్ఎస్ నేతలు డిమాండ్‌చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి ఓబీసీ మోర్చ గీతాసెల్ కన్వీనర్ బంటారం యాదగిరిగౌడ్, బిజెపి సీనియర్ నేత నైషదం సత్యనారాయణమూర్తి, జి.జయేందర్‌బాబు, బిఆర్ఎస్ నగర నాయకులు వై.రంజన్‌నాయుడు, అనీల్‌కుమార్, టిడిపి నేత భవానీ శ్రీనివాస్ మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి ఎపిలో రోజురోజుకు పెరుగుతున్నప్రజాధరణ చూసి ఓర్వలేకనే స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఎపి ప్రభుత్వం అక్రమ కేసును బనాయించి అరెస్టు చేశాని, బాబు అరెస్టును తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు ఖండిస్తున్నారని పేర్కొన్నారు. జగన్ తన పైశాచిక ఆనందం కోసం బాబును జైలులో పెట్టారని ఆరోపించారు. ఇదే కాకుండా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను కూడా అరెస్టు చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు.

## కుత్బుల్లాపూర్ అభివృద్ధి బిజెపితోనే సాధ్యం

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కాలనీ వాసులతో మాట్లాడుతున్న శ్రీశైలం గౌడ్

జీడిమెట్ల, అక్టోబర్ 13, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని కూన శ్రీశైలం గౌడ్ అన్నారు కుత్బుల్లాపూర్ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులతో గురువారం రాత్రి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సమావేశమయ్యారు. శ్రీనివాస్‌నగర్ కాలనీ వాసుల ఆహ్వానం మేరకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకవచ్చినటు వంటి పథకాలను వివరిస్త రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రాబోయే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టాలని, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ది చెప్పాలని అన్నారు. 9ఏళ్ళుగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అభివృద్ధికి అడ్డంగా మారి, కుత్బుల్లాపూర్‌ని కబ్జాలపూర్‌గా మార్చాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్ కాలనీ వాసులు అలివేలు, విజయలక్ష్మీ, సురేందర్, రవీందర్, శేకర్, లక్ష్మీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా ఉజ్జయినీ మహాకాళీ దేవీ శరన్నవ రాత్రులను ఘనంగా నిర్వహిస్తాం

**ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి**

బేగంపేట అక్టోబరు 13,ప్రభాతవార్త : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో దేవీ శరన్నవ రాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు.శుక్రవారం ఆల యంలో ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి వివరా లను వెల్లడించారు.15నుంచి 23వరకు దసరా నవరా త్రులలో నిత్యం చండీహోమం,అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందని చెప్పారు.ఆలయ ప్రాంగణం లో 20వతేదీన బతుకమ్మ సంబురాలు జరుగుతాయని ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

## చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 13ప్రభాతవార్త: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో లయన్స్ భోజనాలయ చారిట్రబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్ రావుగుప్త పాల్గొన్ని నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో భజరంగ్‌సేనా ప్రధాన కార్యదర్శి సూర్య శుక్లా,ఆర్గనైజింగ్ కార్యదర్శి సునీల్‌అగర్వాల్, సిటి అధ్యక్షులు ఎం.మనోజ్,యూత్ అధ్యక్షులు వినత్‌యాదవ్,లయన్స్ భోజనాలయ చారిట్రబుల్‌ట్రస్ట్ చైర్మన్ కమల్‌కిషోర్ అగర్వాల్, సభ్యులు మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి లక్ష్మీగణపతి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు

చిక్కడపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలను 15వ తేదీ నుంచి అక్టోబర్ 24వ తేదీవరకు నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, లక్ష్మారెడ్డి వివరించారు. 15న బాలాత్రిపుర సుందరీ దేవి అలంకారం, 16న మంగళగౌరీ, 17న అన్నపూర్ణాదేవి, 18న గాయత్రీదేవి, 19న మహాలక్ష్మీదేవి, అక్టోబరు 20న లలితాదేవి, 21న సరస్వతి దేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్దినీదేవి, 24న రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారలుంటాయన్నారు. అదే రోజు దసరా సందర్భంగా శమీపూజ ఉంటుందని అన్నారు. కాగా ప్రతి రోజు 9.30 గంటలకు, తిరిగి సాయంత్రం ఆరున్నర గంటలకు శ్రీదేవి మానసిక పూజా విధానముగా దుర్గాదేవికి కుంకుమ పూజలుంటాయన్నారు. భక్తులు ఆయా కార క్రమాల్లో పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బిఆర్ఎస్‌లో చేరిక



బిఆర్ఎస్ పార్టీలో చేరిన మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 13, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జీడిమెట్ల గ్రామానికి చెందిన బిజెపి నాయకురాళ్ళు వార్డు సభ్యురాలు బేకు శ్యామల తన అనుచరులతో కలసి శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతూ గులాబీ గూటికి చేరారు. వీరికి ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సగౌరవంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, సంపత్ మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్, గుమ్మడి మధుసూదన్, కాలే నగేష్, బేకు ఆనంద్, ఇందిరారెడ్డి, ఎల్లేశ్వరి, బాలమణి, ప్రమీల, లక్ష్మీ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మెస్ చార్జీల పెంపుపై మండిపడ్డ ఒయూ విద్యార్థినులు



మెస్‌చార్జీల పెంపుపై రోడ్డుపై బైటాయించిన ఒ.యూ విద్యార్థులు

తార్నాక, అక్టోబర్ 13 ప్రభాతవార్త: పెంచిన మెస్ చార్జీల పై ఒ.యూ విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒ.యూలో శుక్రవారం రాత్రి రోడ్డుపై బైటాయించి ఆందోళన చేశారు. ఒ.యూ అధికారులు ఇటీవల ఇష్టమొచ్చినట్లుగా మెస్‌చార్జీలను పెంచడంతో తాము చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైటాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఒ.యూ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థినులను సముదాయించి అక్కడి నుంచి పంపించినా తిరిగి వారు వచ్చి ఆందోళన చేశారు. దీంతో పోలీసులు విద్యార్థినుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మరో సారి పోలీసులు వారిని అక్కడి నుంచి బలవంతంగా పంపించారు.

## హామాలిబస్తీలో బొడ్రాయి శంకుస్థాపనకు ఏర్పాట్లు


బస్తీవాసులతో సమావేశమైన గుర్రం పవన్‌కుమార్ గౌడ్

సికింద్రాబాద్, అక్టోబర్ 13 ప్రభాతవార్తః బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ హామాలిబస్తీలో బొడ్రాయి శంకుస్థాపన ఏర్పాట్ల కోసం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ బస్తీ ప్రజలతో సన్నాహక సమావేశం జరిపారు. హామాలిబస్తీ చాలా సంవత్సరాలుగా అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, బస్తీ ప్రజలు తలంచిన ఏ పనికూడా సక్రమంగా జరుగడం లేదని స్థానిక సంఘం సభ్యులు పురోహితుల దృష్టికి తీసుకువెళ్ళడంతో వారు ఇచ్చిన సూచనల మేరకు బస్తీలో బొడ్రాయిని నిలపాలని నిర్ణయించారు. ఇందుకోసం జరాపాల్సిన ఏర్పాట్ల కోసం బీఆర్ఎస్ నేత గుర్రం పవన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గుర్రం పవన్‌కుమార్ గౌడ్ స్థానికులతో సమావేశమై ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జరుపుతున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు, మాజి కార్పొరేటర్ ఏసూరి సావిత్రి, అంబులెన్స్ సురేష్, మహేందర్ గౌడ్, ముక్కా శ్రీనివాస్, శ్రీనివాస్, మల్లేష్, వినోద్, సురేష్, శివ కుమార్, దుర్గా, కౌసల్య, సుభాష్, హనుమంతు పాల్గొన్నారు.

## దేవర కరుణాకర్ సేవలు మరువలేనివి


దేవర కరుణాకర్ చిత్రపటానికి
పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు

మెహిదీపట్నం, అక్టోబర్ 13, ప్రభాతవార్త : దివంగత నేత, బిజెపి గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ సేవలు మరువలేనివని బిజెపి రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. ఆయన పేరుతో అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. దేవర కరుణాకర్ స్వర్గస్తులై 9 నెలలు గడిచిన సందర్భంగా శుక్రవారం కార్వాన్‌లోని ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లోని చిన్నారులతో పాటు గర్భిణీలకు, రోగులకు మందులు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్, దేవర వంశీలు మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా దేవర కరుణాకర్ ప్రజా క్షేత్రంలో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలతో పాటు ఎంతో మంది పేద వారిని ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కార్యమంలో బిజెపి కార్వాన్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కట్ల అశోక్, రాచకొండ శ్రీకాంత్ సాగర్, నామ యాదగిరి, సందేశ్ యాదవ్, సుధాకర్ యాదవ్, అనీల్, నాగరాజు ఉన్నారు.

## గడప గడపకు సంక్షేమ పథకాలు


సమావేశంలో పాల్గొన్న మిత్ర కృష్ణ

మెహిదీపట్నం, అక్టోబర్ 13, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని గడపలేదన్నారు. ఏదో ఒక సంక్షేమ పథకం ప్రతి కుటుంబానికి చేరాయని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం గుడిమల్కాపూర్ డివిజన్ లక్ష్మీనగర్ చౌరస్తాలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్ది ప్రతి పక్షపార్టీల నాయకులకు వణుకుపుడుతుందన్నారు. కార్వాన్ సెగ్మెంట్‌లో బిఆర్ఎస్ పార్టీ గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ అడక్ కమిటీ సభ్యులు కె. శేఖర్‌రెడ్డి, క్రిష్ణదాస్ నాయకులు ఉన్నారు.

## అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలి


ప్రసంగిస్తున్న మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ

చిక్కడపల్లి అక్టోబరు 13ప్రభాతవార్త: అన్ని రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే మాదిగలకు ఏం చేస్తారో తెలుపుతూ మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ డిమాండ్ చేశారు.మాదిగలను విస్మరించే పార్టీలకు ఓటు ద్వారా బుద్ధి చెబుదామని అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎంహెచ్‌డి రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సునీల్ మాదిగ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు మాదిగలకు 13 సీట్లు కేటాయించాలని, ఆంధ్రప్రదేశ్ మాదిరిగా తెలంగాణలో కూడా మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్సీ వర్గీకరణ అంశంలో స్పష్టమైన హామీతో పాటు కార్యాచరణ ప్రకటించడంతో పాటు రాష్ట్రంలో లెదర్ పార్కులకు నిధులు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్‌ప్రెసిడెంట్‌లు ఎలుకటి జనార్దన్‌మాదిగ, కె.రవిమాదిగ, బోయ వెంకటరమణ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తప్పెట్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, బేడ బుడిగ జంగాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, మహిళా నాయకులు మేతరి రోజారాణిణి, మంద లావణ్య, బంగారు దుర్గా, రాష్ట్ర నాయకులు కుడెల్లి ప్రవీణ్, ఎల్కపల్లి రాజేందర్ మాదిగ, వద్దూరి శ్రీనివాస్ మాదిగ, బి.నర్సింహా మాదిగ, మారపాక సాయన్న మాదిగ, కె.నారాయణ మాదిగ పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టడం తగదు

కంటోన్మెంట్, అక్టోబర్ 13 ప్రభాతవార్తః ఎన్నికల నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం సరి కాదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంలో తప్పులేదు, కాని నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. నగరానికి చెందిన స్వర్ణకారులే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చి స్థిరపడి వ్యాపారాలు నిర్వహించుకుంటున్న తీరుతో వ్యాపారులు ఎంతో ఆందోళన, ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయకుండా వ్యవహరించాలని మంత్రి శ్రీనివాస్ యాదవ్ కోరారు.

## తెలంగాణ మలేషియా దేశ సాంస్కృతిక ఒప్పందం


యూసుఫ్ నుజురుల్లా, నారాయణస్వామికి పుస్తకాలను అందజేస్తున్న విశ్వకర్మ డిఆర్‌కె

నాంపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త : ప్రపంచవ్యాప్తంగా ప్రతీ దేశానికొక సాంస్కృతిక, సంప్రదాయ వైభవాలు ప్రత్యేకతను సంతరించుకొంటాయని, వాటిని ఇచ్చిపుచ్చుకోవడం, పంచుకోవడంలో మహదానందంతోపాటు ఒకరి సంస్కృతి, సంప్రదాయాలను మరొకరు తెలుసుకొని పరస్పర మార్పిడితో అవన్నీ విశ్వవ్యాప్తమవుతాయని, ఆ సదుద్దేశంలో భాగంగానే తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత ప్రత్యేకించి తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను సంయుక్తంగా నిర్వహించుకోవడం, మార్పిడితో అభ్యసించడం, ప్రోత్సహించుకోవడం పరిపాటి అయిన తరుణంలో తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు నిలయమైన సాహిత్య పుస్తకాలను మారిషస్ దేశం తో పంచుకోవడం జరిగిందని సింగిడి సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ విశ్వకర్మ డిఆర్‌కె తెలి పారు. విశ్వకర్మ మారిషస్ దేశ రాజధాని పోర్టులూయిస్ నగర ప్రథమ పౌరుడు లార్డ్ మేయర్ మహమ్మద్ యూసుఫ్ నుజురుల్లా, మారిషస్ తెలుగు మహాసభ అధ్యక్షుడు కె.నారాయణస్వామి తదితరులను కలిసి తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ తరపున సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ ఆధ్వర్యంలో ప్రచురింపబడిన పుస్తకాలను వారికి బహూకరించారు.

## గెలుపే లక్ష్యంగా ప్రజా క్షేత్రంలో దూసుకుపోవాలి

నిజాంపేట, అక్టోబర్ 13, ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో దూసుకుపోవాలని పైడి మాధవికి ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ సూచించారు. శుక్రవారం నిజాంపేట మున్సిపల్ కార్పోరేటర్ పైడి మాధవి బిఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా వారిని ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని, అలాగే ఈ ఎలక్షన్స్‌లో బిఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కెపి వివేకానంద్ గెలుపుకు సహకరించాలని కోరారు.

## మూడోసారి గాంధీని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటాం

### కూకట్‌పల్లి మహిళా విభాగం నాయకురాళ్లు


ఎమ్మెల్యే గాంధీతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మహిళలు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 13, ప్రభాతవార్త : రాష్ట్రంలో మళ్ళీ బిఆర్ఎస్ పార్టీదే హ్యాట్రిక్ విజయమని శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో గెలిచి గులాబీ జెండా ఎగురవేస్తావని కూకట్‌పల్లి డివిజన్ మహిళా విభాగం నాయకులు పేర్కొన్నారు. కూకట్‌పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మహిళ నాయకులతో ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ నివాసంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి పాల్గొని ప్రసంగించిన ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీని సన్మానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం అభ్యర్థిగా మళ్ళీ నన్ను ప్రకటించిన శుభసందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్‌కి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. మరింత బాధ్యతతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో గెలిచి శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి నావంతు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. మీ అందరి ఆశీస్సులతో, సహాయ సహకారాలతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్ ల సహకారంతో 9వేల కోట్ల నిధులతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్డు దినోత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బాలస్వామి, ఏజిల్‌కుమూర్, ఉదయ్‌సింగ్

హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త: అనేక వ్యాధుల నివారణకు గుడ్డు దివ్య ఔషధంగా ఉపయోగపడుతుందని పలువురు వక్తలు అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌కనబ్‌లో ప్రపంచ గుడ్డు దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్డుప్రాముఖ్యతను వివరించి దానిప్రాముఖ్యపై రూపొందించి కరపత్రం ఆవిష్కరించారు. 1996లో వియత్నాం ప్రపంచ పౌల్ట్రీ కాంగ్రెస్ సభలో జరిగిన తీర్మాణం మేరకు పౌల్ట్రీ రంగ రైతులు ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ నెలలోని రెండవ శుక్రవారం గుడ్డు దినోత్సవాన్ని జరుకుంటున్నారన్నారు. ఈసందర్భంగా నెక్ సలహాదారు డాక్టర్ కరణం బాలస్వామి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి నుంచి సంక్రమిస్తున్న వ్యాధుల పరిష్కారానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. మధుమేహం, ఊబకాయం, గుండెజబ్బులు, క్యాన్సర్, వ్యాధులు నివారించేందుకు గుడ్డ తీసుకోవాలని సూచించారు. కోడిగుడ్ల గురించి అపోహలు వీడి అన్నివయస్సులు వారు తినవచ్చున న్నారు. ఈకార్యక్రమంలో నెక్‌సిఈఓ డాక్టర్ ఏజిల్‌కుమార్, పౌల్ట్రీఇండియా నూతన అధ్య క్షులు ఉదయ్‌సింగ్, జోనల్ సంఘం అధ్యక్షులు జక్క సంజీవ్‌రెడ్డి, తెలంగాణ ఫెడరేషన్ అధ్యక్షులు కె.మోహన్‌రెడ్డి, డి.సుధాకర్, డిఎస్ సుబ్బ్యమన్యం, తదితరులుపాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం బిజెపినీ బలపరచండి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, అక్టోబర్ 13, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు బిజెపిని బలపరచాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని హరిజన బస్తీ, నల్లపోచమ్మ దేవాలయం నుండి ఇంటింటికి బిజెపి భరోసా యాత్ర 63వ రోజు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రారంభించారు. గడప గడపకు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మరోసారి మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే విధంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని కోరారు. రోజురోజుకు ప్రజల్లో బిజెపికి జనాధారణ పెరుగుతుందని ఈసారి ఖచ్చితంగా అవకాశం ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జీ మాధవరం కాంతారావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కృష్ణాగౌడ్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ కంచి మహేందర్, రాష్ట్ర ఓబిసి మోర్చా నాయకులు రామ్మోహన్, ఓబీసీ మోర్చా కో కన్వీనర్ సతీష్‌గౌడ్, జిల్లా యువమోర్చా నాయకులు హరిప్రసాద్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ బానేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ వర్శిటీ పాత బ్యాచ్‌ల విద్యార్థులకు ప్రత్యేక అడ్మిషన్

ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 13, ప్రభాతవార్త : డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పాత బ్యాచ్‌ల విద్యార్థులకు తమ కోర్సు పూర్తి చేసుకోవడానికి ప్రత్యేక అవకాశం (స్పెషల్ రీ అడ్మిషన్) కల్పిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్వీకే రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం 1991 నుండి 2011 డిగ్రీ (బి.ఏ / బి.కాం / బి.యస్సీ) విద్యార్థులకు విశ్వవిద్యాలయం స్పెషల్ రీ అడ్మిషన్ పొందడానికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. గతంలో విశ్వవిద్యాలయంలోని పలు కోర్సుల్లో చేరి, సకాలంలో కోర్సు పూర్తి చేయలేకపోయిన (ఓల్డ్ బ్యాచ్) విద్యార్థులకు వాటిని పూర్తి చేయడానికి ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ రీ అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులందరూ, జూబ్లీహిల్స్ (హైదరాబాద్)లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్, విద్యార్థి సేవల విభాగంను సంప్రదించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని అన్నారు.

## శివం ప్రాంగణంలో శరన్నవరాత్రి, బతుకమ్మ సంబరాలు

ధర్నాచౌక్, అక్టోబర్ 13, ప్రభాతవార్త: న్యూనల్లకుంటలోని శివం ప్రాంగణంలో ఈనెల 15 నుండి 24 వ తేదీ వరకు సాయి శరన్నవరాత్రి, బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు ఏ.మల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆదివారం ప్రారంభం అయ్యే కార్యక్రమంలో 108 దంపతుల జంటలు పాల్గొని, కంకణధారణ నిర్వహించి, విఘ్నేశ్వరపూజతో మొదలు పెట్టి పదిరోజుల పాటు నియమ నిష్ఠలతో పూజలు, సాయంత్రం వేళ బతుకమ్మ సంబరాలు, 24వతేదీ చండ హోమం, పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. విజయదశమి రోజు కోట శివకుమార్ సకల సుభాల విజయదశమి విశిష్టత గురించి సత్సంగం ఉంటుందని అన్నారు. పదిరోజుల పాటు నిర్వహించే సాయి శరన్నవరాత్రి, బతుకమ్మ సంబరాలలో ప్రజలం దరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ముఖ్య నాయకులతో కార్పొరేటర్ సమావేశం


సమావేశంలో మాట్లడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

నాచారం, అక్టోబర్ 13 ప్రభాతవార్త: మల్లాపూర్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఎస్ఎల్ఎన్ఎస్ హాల్లో సమావేశ మయ్యారు. ఉప్పల్ నియోజక వర్గం అభ్యర్థి లక్ష్మారెడ్డి గెలుపుకోసం అందరం కష్టపడి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి గెలిపిస్తే అందరికి తగిన గుర్తింపు ఉంటుందని, ఉద్యమకారుల సమస్యలన్ని బిఎల్ఆర్‌కు తెలుసునన్నారు. రెండు నెలలు అందరం ఐకమత్యంతో ఉండి గెలుపు కోసం శ్రమిద్దామని కోరారు. అనంతరం పలుసూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జ్యువెల్లర్స్ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దు


విలేకర్ల సమావేశంలో కార్పొరేటర్ కొంతం దీపిక

కంటోన్మెంట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త: ఎన్నికల నిబంధనల పేరుతో పోలీస్‌లు జ్యువెల్లర్స్ (బంగారు) నగల వ్యాపారులను తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నందుకు నిరసనగా గురువారం సికింద్రాబాద్‌లోని పాట్ మార్కెట్‌లోని జ్యువెల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో బంగారు నగల దుకాణాలను మూసి వేసి నిరసన తెలిపారు. అభరణాలు తయారు చేసిన తరువాత పాలిస్ కోసం మరో దుకాణానికి వెళ్తున్న సమయంలో అట్టి బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని తమను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు హిమాన్షు, అనీల్ కుమార్, అశోక్, మహవీర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## బతుకమ్మతో ముందడుగు సెల్ఫీ కాంటెస్ట్

హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త: ముందడుగు ఫౌండేషన్, సేవ్‌ద గర్ల్స్ చైల్డ్ ఆధ్వర్యంలో "మీ బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తెలంగాణలో బతుకమ్మ పండుగ అంటేనే బాలికలు, యువతులు, మహిళలు ఎంతో అందంగా ముస్తాబై బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తారు. అలాంటిది ముందడుగు ఫౌండేషన్ ,సేవ్‌గర్ల్‌చైల్డ్ సంయుక్తంగా "మీరు అందంగా ముస్తాబై ,మీరు అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మతో సెల్ఫీ పంపండి నిర్వాహకులు గాదిరాజు స్రవంతి, పిడమర్తి స్నిగ్ధ తెలిపారు. ఫోటోలు పంపిన వారిలో ఐదుమందిని సెలక్ట్ చేసి బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఎంపికైన విజేతలకు ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరిండెంట్ శివకుమార్ బహుమతులు అందజేస్తారని తెలిపారు

## కాంగ్రెస్ 2, 3 సార్లు ఓడిపోయిన వారికి కాకుండా యువతకు అవకాశం కల్పించాలి

### లేకపోతే 70 మంది రేబల్స్ అభ్యర్థులు పోటికి సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న మర్రి దుర్గేష్

సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి, రెండు, మూడు సార్లు ఎన్నికల్లో పోటి చేసి ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తిరిగి టిక్కెట్లు కేటాయించరాదని అచ్చంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఓటమి పాలైన అభ్యర్థులకు కాకుండా యువతకు ప్రాధాన్యత కల్పించి సీట్లు కేటాయించాలని లేని పక్షంలో 60 నుంచి 70 వరకు రెబల్స్ అభ్యర్థులు పోటీచేసే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అచ్చంపేట నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మర్రి దుర్గేష్ మాట్లాడుతూ తాను 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర నాయకులు ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారని, దీంతో తాను అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్ కోసం తాను దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. కాగా అధిష్టాన వర్గం గతంలో కాంగ్రెస్ పార్టీ తరుపున రెండు, మూడు సార్లు పోటి చేసి ఓడిపోయిన అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తున్నదని ఆరోపించారు.

## కాంగ్రెస్ పార్టీ వడ్డెర్లకు రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి

### జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ విజ్ఞప్తి

సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త:రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఉండి అన్ని రంగాలలో వెనుకబడ్డ వడ్డెర జాతిని కనీసం రాజకీయ రంగంలోనైనా ఎదగడానికి కాంగ్రెస్ పార్టీ రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్ అధిష్టాన వర్గానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎఐసిసి నాయకులు, టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. వడ్డెరు అత్యధికంగా ఉన్న కుత్బుల్లాపూర్, శౌరిలింగంపల్లి నియోజవర్గాల సీట్లు వడ్డెరులకు కేటాయించాలని, కుత్బుల్లాపూర్‌లో 35 వేలమంది వడ్డెరు ఓటర్లు ఉన్నారని, అలాగే శౌరిలింగంపల్లిలో 40 వేలమంది ఓటర్లు ఉన్నారని, కాంగ్రెస్ పార్టీ సీట్లు కేటాయిస్తే సునాయసంగా విజయం సాధిస్తామని చెప్పారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర నాయకులు కాంగ్రెస్ పార్టీ విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేస్తారని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ వడ్డెర కులస్తులను పట్టించుకోవడం లేదని, మొండి చెయ్యి చూపించిందని ఆయన ధ్వజమెత్తారు.

## 15న సమతా సైనిక్ దళ్ రాష్ట్ర మహాసభలు

సైఫాబాద్, అక్టోబరు 13 ప్రభాతవార్త: ఆల్ ఇండియ సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ 10వ మహాసభలు ఈ నెల 15వ తేదీన సైఫాబాద్‌లోని ప్రబుద్ధ భారత్ ఇంటర్‌నేషనల్‌లో జరుగుతాయని దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డి.లక్ష్మయ్య తెలిపారు. ఈ మహాసభలలో ముఖ్యఅతిథిగా సైనిక్ దళ్ జాతీయ చైర్మన్ డా.హెచ్.ఆర్.గోయల్ పాల్గొంటారని , ప్రత్యేక ఆహ్వానితులుగా జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ శెండే, మాజీ చైర్మన్ ఎస్.చంద్రయ్య హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా నైతిక విలువలు అనే అంశంపై తాను ప్రసంగిస్తానని, భారత రాజ్యాంగ నిర్మాణంలో డా.అంబేద్కర్ పాత్ర అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్ కాశీం ప్రసంగిస్తారని, డా.అంబేద్కర్ ఆలోచనా విధానంలో దళ్ పాత్ర అనే అంశంపై బైరీ నరేష్, సంఘ అభివృద్ధి, నాయకత్వ లక్షణాలు అనే అంశంపై డా.డి.యాదయ్య, అంబేద్కర్ ఉద్యమంపై మహిళల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ ఇ.సుధారాణి ప్రసంగిస్తారని ఆయన వివరించారు.

## లలితసంగీత శిఖరాగ్ర గురువులు పి.వి.సాయిబాబా, కె.రామాచారి

### తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి


సాయిబాబా, రామాచారిలను సత్కరిస్తున్న రమణాచారి, వకుళాభరణం

నాంపల్లి, అక్టోబరు 13 ప్రభాతవార్త : లలిత సంగీతంలో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన శిఖరాగ్ర గురువులు పి.వి. సాయిబాబా, కె.రామాచారిలని, వేలాదిమందిని గాయకులుగా తీర్చిదిదారని తెలంగాణ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. మహోత్కృష్టమైన దినమని, ఎవరు గుర్తించినా గుర్తించకపోయినా ఎన్నో కావ్యాలు వ్రాసిన, లలితగేతాలపై పరిశోధనచేసి డాక్టరేట్ సంపాదించుకొన్న, చిన్నవయస్సు నుండే పద్యాలు, గేయాలు, కవితలు వ్రాస్తూ సాహితీ సంపదను, ప్రతిభను అందించిన నేటి బతికున్న దాశరథి వద్దేపల్లి కృష్ణ అని రమణాచారి అభివర్ణిస్తూ సంగీతరంగంలో భవిష్యత్తును ఇప్పుడే దర్శింపజేస్తున్న చిన్నారులకు గురువు కె.రామాచారి, ఆయన గురువు పి.వి.సాయిబాబాలను మూడుదశాబ్దాల కింద ప్రారంభించిన తన కలహంసి సంస్థ ద్వారా ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారాలు అందజేయడం వద్దేపల్లికృష్ణ సంస్కారానికి, సమున్నతమైన ఆశయానికి దర్పణంపడుతుందని అన్నారు.

## కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌ను గెలిపించాలి : లాస్య

కంటోన్మెంట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న అడుగు జాడల్లో పనిచేస్తూ వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసిసి కట్టుగా పనిచేయాలని బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య తెలిపారు. గురువారం ముఖ్య నాయకులతో సమావేశమై సిఎం కేసిఆర్, మంత్రి కేటిఆర్‌ల ఆశీసులతో తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సదానంద్ గౌడ్, పనస సంతోష్, బత్తుల నారాయణ, బాస్కర్ ముదిరాజ్, మరరళీ యాదవ్, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, అనితా ప్రభాకర్ పాల్గొన్నారు.

## కార్వాన్‌లో మజ్లిస్ పార్టీకి ఎదులేదు: ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

మెహిదీపట్నం, అక్టోబర్ 13, ప్రభాతవార్త : కార్వాన్ సెగ్మెంట్‌లో మజ్లిస్ పార్టీకి ఎదులేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. అన్ని వర్గాల మద్దతు మజ్లిస్ పార్టీకే ఉందన్నారు. టోలిచౌకి నీరజ్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీరోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కోట్లాది నిధులను విడుదల చేసిన ఘనత మజ్లిస్ పార్టీకి దక్కుతుందన్నారు. మజ్లిస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. కార్వాన్‌లో ఇతర పార్టీల మనుగడ భూస్థాపితం అయిందన్నారు. అన్ని వర్గాల మద్దతుతో ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నాని తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లు మరియు DRC కేంద్రాల వద్ద సౌకర్యాల ఏర్పాటు నిమిత్తం అవసరమైన ఐటమ్‌లకు (రోజువారీ) అద్దె ధరలు

| క్ర.సం. | ఐటమ్ వివరణ | యూనిట్ |
|---|---|---|
| 1 | | |
| 1. | ఫర్నీచర్ | |
| | a. Ms టేబుల్స్ (2'x4') | ఒక్కొక్కటి |
| | b. ప్లాస్టిక్ తయారీ కుర్చీలు | ఒక్కొక్కటి |
| | c. పార్టిషన్/సైడ్ వాల్స్ సైజ్ 9'x8' (కస్సాత్) | ఒక్కొక్కటి |
| | d. టేబుల్ సైజ్18'x9' | ఒక్కొక్కటి |
| 2. | త్రాగునీటి సౌకర్యం | |
| | a. ప్లాస్టిక్ డ్రమ్ములు (200 లీటర్లు) 2సం.ల లోటాలతో | ఒక్కొక్కటి |
| | b. ప్లాస్టిక్ కూల్ వాటర్ క్యాన్‌లు | ఒక్కొక్కటి |
| 3. | క్యూ కొరకు నీడ నిమిత్తం | |
| | a. 3 PS లకు ఫ్లెక్స్ 36'x18' సైజుగల టెంట్ (ఒక్కొక్క PS కు ప్రపోర్షనేట్ వాటాగా) | ఒక్కొక్కటి |
| | b. టెంట్ సైజ్ 36'x12' | ఒక్కొక్కటి |
| | c. టెంట్ సైజ్ 24'x12' | ఒక్కొక్కటి |
| 4. | టాయిలెట్ సౌకర్యాలు | |
| | a. ప్రస్తుతం వున్న టాయిలెట్స్, పనిరోజులు కలిపి క్లీనింగ్ మరియు మరమ్మతులు | ఒక్కొక్కటి |
| | b. బకెట్ మరియు మగ్ | ఒక్కొక్కటి |
| 5. | తెలుపు వస్త్రం | చ.అడుగులు |
| 6. | ఆకుపచ్చ చాప | చ.అ |
| 7. | మొబైల్ టాయిలెట్స్ | ఒక్కొక్కటి |
| 8. | వయాస్/స్టేజ్ | చ.అ |
| 9. | ప్యాకింగ్ డ్రాప్ | చ.అ |
| 10. | టేబుల్ క్లాత్ | ఒక్కొక్కటి |
| 11. | టేబుల్ ఫ్లాప్స్ | ఒక్కొక్కటి |
| 12. | ఫ్లెక్సీ బ్యానర్స్ | చ.అ |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చాంద్రాయణగుట్ట సర్కిల్-8, చార్మినార్ జోన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR.No.8133-PP/CL/Advt/1/2023-24 తేది: 13.10.2023



IN THE COURT OF THE HON'BLE XI ADDL. JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS : AT :: SECUNDERABAD
O.S. No. 705 of 2023
Between:
Mrs. Anishetty Vidyavathi and others ....Plaintiffs
AND
1.The Tahasildar , Musheerabad Mandal, Lower Tank band,Hyd-80 and others ....Defendants
To
ALL CONCERNED .....Defednants
Please take notice that the above O.S. is filed for declaring the Plaintiffs are the owners of suit schedule property being, the legal heirs and successors of their late Husband and Father i.e. late Narsing Rao and the same is posted on **01.11.2023, at 10:30 A.M** for your appearance. You may appear either in person or through an advocate before the said court and said date, failing which the matter will be decided exparte.
BY COURT ORDER
**PENTAM SATYANARAYANA, GOTURI VENKATESHAM,**
Advoctes
Office at: Flat No.304, Third Floor, Sri Prtagathi Plaza, Above Vijaya Daignostics, O.U.Main Road Nallakunta , Hyderabad–500 044
**Cell No. 9885458822**



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE-CUM-ASSISTANT SESSIONS JUDGE RANGA REEDY DIST. AT: L.B. NAGAR
S.O.P. No. 25 OF 2023
Between:
**1. Sri. V.N. Srinivasa Rao** S/o. late Sri. Vadlamudi Rama Koteswara Rao, aged about: 41 years, Occ: Pvt. Employee, Presently residing at Flat No. 405, 4th Floor, Plot No.6, Huda Complex, Saroornagar, R.R.Dist., Telangana-500 035, **Permanent address:** R/o. Flat No. 304, Adora Residency, Wasa Layout, Doddenakundi, Bengaluru - 560037
**2. Smt. Vadlamudi sri laxmi sayee,** D/o. late Sri.Vadlamudi Rama Koteswara Rao, aged: about 37 years, Occ: Pvt. Employee, Presently residing at Flat No. 405, 4th Floor, Plot No.6, Huda Complex, Saroornagar, R.R.Dist., Telangana-500 035 **Permanent address:** R/o. Flat No. 304, Adora Residency, Wasa Layout, Doddenakundi, Bengaluru - 560037 Rep. by her GPA Sri. V.N. Srinivasa Rao S/o. late Sri.Vadlamudi Rama Koteswara Rao, aged about: 41 years, Occ: Pvt. Employee, R/o. at Flat No. 405, 4th Floor, Plot No.6, Huda Complex, Saroornagar, R.R.Dist., Telangana-500 035 ...Petitioners
AND
**1) State Bank of India,** Vidya Nagar Branch, H.No.:1-8-702/4, Vidyanagar, Hyderabad, Telangana- 500044
**2) Karvy Computer Share Pvt. Ltd.** Selenium Building, Tower - B, Plot No 31 & 32, Financial District Nanakramguda, Serilingampally, Hyderabad, Telangana-500032
**3) KFIN Technologies Limited** Selenium Building, Tower-B, Plot No 31 & 32, Financial District Nanakramguda, Serilingampally, Hyderabad, Telangana-500032
**4) Bank of Baroda,** Head Office, R/o.: Baroda House, Mandvi, Vadodara, Gujarat -390 006.
**5) Bank of Baroda,** Regional Office, R/o.: H.No.3-6-262/6, Tirumala Estate, Himayatnagar, Hyderabad - 500029
**6) To all concerned** ...Defendants
**NOTICE**
To,
All Concerned
Please take notice that the Plaintiffs filed the above S.O.P. against all the concerned for declaring the plaintiffs as surviving legal heirs of late Sri. Vadlamudi Rama Koteswara Rao. And You are hereby summoned to appear before the court on **13.11.2023 at 10.30 A.M.** before the Hon'ble Principal Senior Civil Judge-cum-Assistant Sessions Judge, Ranga Reddy, in person or by an advocate duly instructed. If you fail to appear on the above said date and time, the matter will be heard and determined in accordance with law.
(BY ORDER OF THE COURT)
**A. BALARAJU**
**Advocates,**
MIG-I, Block-14, Flat-7, APHB Colony, Near Ambedkar College, Baghlingampally, Hyderabad-500 044. **Mob. 8074445374**

## తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపిన సిఎం కేసీఆర్ : మంత్రి సబితాఇంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** ఉద్యమ నాయకుడిగా సిఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారని విద్యాశాఖ మంత్రి, మహేశ్వ రం నియోజకవర్గ బిఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన డివిజన్ బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సిఎం కేసీఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపామని, రానున్న కాలంలో మరింత అభివృద్ధికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీకి సైనికుల్లాంటి కార్యకర్తల బలం ఉందని, ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని మంత్రి పిలుపుని చ్చారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు పార్టీకి మధ్య వారధులుగా పని చేయాలన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి బిఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా, మాజీకార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్, రేషిగుప్త, బాల్‌రాజ్‌గుప్త, మురిషెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్డు ఆరోగ్యానికి వెరిగుడ్... రోజువారి ఆహారంలో గుడ్డుతో దీర్ఘకాలిక ప్రయోజనాలు

**హయత్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** రోజువారి ఆహారంలో గుడ్డును చేర్చ దంద్వారా శరీరానికి నాణ్యమైన ప్రొటీన్‌ను అందించవచ్చని కాంగ్రెస్ పార్టీ ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఇంఛార్జీ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. జాతీయ గుడ్డుదినోత్సవాన్ని పురస్కరించుకుని భాగ్యలత కాలనీలోని మహావీర్ హరిణ వనస్థలి నేషనల్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు గుడ్డు తినడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. గుడ్లతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఎముకలు పటిష్టమవుతాయని, కంటి చూపు మెరుగవుతుం దని, గుడ్లతో మానవాలికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. జాతీయ గుడ్డు దినోత్సవాన్ని 'ఎగ్స్ ఫర్ బెటర్ లైఫ్' అనే థీమ్‌తో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పౌల్ట్రిఫెడరేషన్ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, డా.బాలస్వామి, మాణిక్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు : ప్రిన్సిపల్ ఎం. శైలజ



బతుకమ్మ పండుగ కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ సంస్కృతి, సంప్రదాయలు ఉట్టిపడేలా యువతులు వస్త్రాలను ధరించి కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు అందరు కలసి బతుక మ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ రచన మల్లిక, అహల్య, రుకియా, భాను, స్వప్న, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంవిఎస్ఆర్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** గత నలభై రెండు సంవత్సరాలుగా నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ గొప్ప పేరు సంపాదించిందని ఓయు వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ డి.రవీందర్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డిలు అన్నారు. నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 2019-2013 బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరైన అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర గల కాలేజీ విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి చేసిన కృషిని ప్రశంసించారు. అదే విధంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులను అభినందించా రు. ఈ కార్యక్రమంలో ఓయు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరామ్, ఎంవిఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ కెపి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్‌జిఎస్ మూర్తి, సొసైటీ వైస్ ఛైర్మన్ పివిఆర్ కశ్యప్, సెక్రటరీ ఎం.కృష్ణకుమార్, జాయింట్ సెక్రటరీలు, హెచ్‌ఓడి లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ కీలకం : ప్రొఫెసర్ రాములు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ రాములు, చిత్రంలో యాదుల్లా, చంద్రయ్య

**మలక్‌పేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** విద్యార్థి దశ ఎంతో కీలకమైందని ఓయు యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాములు పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన ఆయన న్యూ నోబుల్ డిగ్రీ కళాశాల ఛైర్మన్ యాదుల్లా, ఇంఛార్జి గౌని చంద్రయ్య, ప్రిన్సిపల్ ప్రేమలతలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సమయం ఎంతో ముఖ్య మైందని, సమయపాలన పాటించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా ర్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## బిఆర్ఎస్‌తోనే చిలుకానగర్ అభివృద్ధి : బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎల్ఆర్



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీతోనే చిలుకానగర్ డివిజన్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఉప్పల్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంబిసి చైర్మన్ తాడూరి శ్రీనివాస్, గొల్లూరి అంజయ్య, పలువురు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గానికి ఐదులైబ్రరీలు తీసుకుని వచ్చానని, నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఉప్పల్‌లో వంద పడకల ఆసుపత్రి కూడా ఏర్పాటు చేస్తున్నామని, అన్ని రకాలుగా సర్వే చేసి సిఎం కెసిఆర్ తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిం చారని తెలిపారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందించే విధంగా తన వంతు కృషి చేస్తానని, ఆపదలో ఉన్న వారికి తన వంతు చేయూత అందిస్తానని ఆయన పేర్కొన్నారు. మరో 47 రోజులు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు బండారి లక్ష్మారెడ్డి విజయం కోసం పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు, వివిధ విభాగాల అనుబంధ కమిటి సభ్యులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం : మర్రి రాజశేఖర్‌రెడ్డి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని 140 డివిజన్ ఓల్డ్ నేరెడ్‌మెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బి.ఆర్.ఎస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం మల్కాజిగిరి బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను తెలుసుకోవడానికి ఈ కార్యాలయం ఉపయోగపడతుందన్నారు. మల్కాజిగిరిలో 3వసారి బిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేసారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బిఆర్ఎస్‌తోనే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.జగదీష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హబ్సిగూడ కాకతీయనగర్ శ్రీ మహంకాళి, రామాలయంలో చీరల బహిరంగ వేలం

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** హబ్సిగూడ కాకతీయనగర్‌లోని శ్రీ మహంకాళి, శ్రీరామ మందిరంలో అమ్మవారికి కానుకలుగా వచ్చిన చీరలను వేలం వేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎల్.భాగ్యలక్ష్మి తెలిపా రు. ఈనెల 17, 18,19 తేదిలలో ఉదయం పదిన్నర గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, భక్తులకు వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు. వేలంలో పాల్గొనే భక్తులు ఆలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హరిహర క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

**మలక్‌పేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహర క్షేత్రంలో ఈ నెల 15వ తేదీనుండి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వ హించనున్నట్లు ఆలయ ఛైర్మన్ సూగూరు రమేష్ పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ అమ్మవారు ఒక్కొక్క అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. విజయదశమి సందర్భంగా సాయంత్రం శమిపూజ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని, ప్రతి రోజూ పంచామృతా భిషేకాలు, సామూహిక సహస్రనామకుంకుమార్చన, మహాహారతి తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఓ మార్తాండరావు, సభ్యులు సరాపు శ్రీహరి, రేణుఅగర్వాల్, పారి జాతారెడ్డి, సత్యేందర్, విజయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

**హయత్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న అభివృ ద్ధి పనులు, అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమపార్టీలో చేరుతున్నార ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ మర్పల్లి గ్రామానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షులు కప్ప సత్యనారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు నక్క శ్రీధర్‌గౌడ్‌తో పాటు ముఖ్య నాయ కులు మున్సిపాలిటీ పార్టీ ప్రధాన కార్యదర్శి పాశం దామోదర్, అనంతుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలవడానికి క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## వైఎస్ఆర్‌టిపి ఉప్పల్ అసెంబ్లీ సీటు కేటాయించాలని వినతి : పంగ యాదగిరిరెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఉప్పల్ అసెం బ్లీ సీటు కేటాయించాలని నియోజకవర్గం నేత పంగ యాదగిరిరెడ్డి శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కౌకుంట్ల రూపేందర్‌రెడ్డి, కె.జితేందర్‌రెడ్డిలను కలిసి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్‌టిపితోనే ఉప్పల్ అభి వృద్ధి జరుగుతుందని, పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టిపి నేతలు భాస్కర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, సాయికిరణ్, శివాజీ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డివిజన్‌లో కార్పొరేటర్ రజితరెడ్డి గడప, గడపకు కాంగ్రెస్ ప్రచారం

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కావేరినగర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గడప, గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప్పల్ కావేరినగర్‌లోని పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి పచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారంటిలపై ఇంటింటికి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు ఎం.పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో ప్రచా రం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, కార్యదర్శి తుమ్మల దేవిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బ్రహ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, బాల్‌రెడ్డి, గొరిగె మహేష్, పాలడుగు లక్ష్మణ్, నవీన్‌యావ్, రాఘవేంద్రగుప్త, నాగారం వెంకటేష్, బాకారం అరుణ్, తోకట రాజు, మహిళా నాయకురాలు రేణుక, సోము బాలమణి, విజయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు పథకాల గురించి ప్రజలకు వివరించాలి : ఎమ్మెల్యే మైనంపల్లి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు

**మల్కాజ్‌గిరి, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** ఓల్డ్ మల్కాజ్‌గిరిలో సాయినాథ్‌గౌడ్ అధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన 6 పథకాలగురించి ప్రజల్లోకి తీసుకెళ్ళి వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, జిఎన్‌వి సతీష్‌కుమార్, పిట్ల శ్రీనివాస్, జీడీ సత్యనారాయణ గౌడ్, గౌసుద్దీన్, నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

**ఆర్‌కేనగర్‌లో...** ఆర్‌కేనగర్ బిఆర్ఎస్ పార్టీ చెందిన సంజయ్, సిరిగిరి రాజు తోపాటు సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా గౌతం నగర్ డివిజన్ ఏకలవ్యనగర్‌కు చెందిన బిఆర్ఎస్ మహిళలు ఎమ్మెల్యే సమ క్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మైనంపల్లి కందు వాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిబ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, బి.కే.శీను, నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్, మాధవి సత్యవేణి, ఉమారాణి, సంధ్య, ఈశ్వరమ్మ, సుజాత, ప్రమీల, కవిత, వాణి, సుప్రజ, జ్యోతి, భాగ్య, లక్ష్మి, కృష్ణ తదితరులు ఉన్నారు.

## లార్డ్స్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ ఉత్సవాలకు హాజరైన కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ హై స్కూల్ లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తులు ధరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి పూజలు నిర్వహించి బతుకమ్మ ఆట పాటలతో సందది చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానో పాధ్యాయుడు రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దండెం రాంరెడ్డి తదితరులు

**హయత్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని... నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను గడపగడపకు తీసుకువెల్లి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కోదండరెడ్డి, టీపీసీసీ కార్య దర్శి, ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యులు దండెం రాంరెడ్డి పిలుపునిచ్చా రు. పెద్దఅంబర్‌పేట సమీపంలోని తారా కన్వెన్షన్‌లో నిర్వహించిన ఇబ్రహీం పట్నం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కేసీఆర్ ప్రభుత్వం కాలం గడుపుతోందన్నారు. కేసీఆర్, కుటుంబ సభ్యులు లక్షల కోట్ల రూపాయల అక్రమ ఆస్తులు కూడబె ట్టుకున్నారని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత బీఆర్ఎస్ నాయకుల అక్రమ సంపాదన కక్కిస్తామన్నారు. ఈ కార్య క్రమంలో పార్టీ నాయకులు రమేష్‌గౌడ్, దండెం నర్సింహారెడ్డి, 7వ వార్డు కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి, హుస్సేన్‌భాయ్, హాతీరామ్, కందుకూరి మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కష్టపడి పని చేసేవారికి గుర్తింపు:బిఎల్ఆర్



మహిళా నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన బిఎల్ఆర్

**నాచారం, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** పార్టీ గెలుపు కోసం రెండు నెలలు కష్టపడి పనిచేయాలని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి కోరారు. నాచారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన మహిళా నాయకు ల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన లక్ష్మారెడ్డి పార్టీ గెలుపు కోసం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్‌తో పాటు పలువురు మహిళలు, నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిదంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి పార్టీ గెలుపుకోసం అందరు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు.

## చంద్రబాబుకు బెయిల్ రావాలని పూజలు



చంద్రబాబుకు బెయిల్ రావాలని హోమం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

**వనస్థలిపురం, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** టిడిపి అధినేత చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ వెంటనే బెయిల్ రావాలని ఎల్‌బినగర్ నియోజక వర్గం వనస్థలిపురం డివిజన్ టిడిపి అధ్యక్షులు వెలగ చంద్రశేఖర్ ఆధ్వర్యం లో గణేష్ టెంపుల్‌లో నిర్వహించిన గణపతి హోమంలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఎస్వీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ చంద్రబాబును వెంటనే విడుదలై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా గెలిచి మళ్ళీ మంచిరోజులు రావాలని ఆకాంక్షించారు. రాబోయే ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌గాంధీ, వెంకటఫణిరాజు, కోటేశ్వరరావు, పొన్నగంటి వెంకటేష్, అశోక్, సింగిరెడ్డి మురళీధర్‌రెడ్డి, గద్దె విజయ్‌నేత, మెల్లం శ్రీని వాసరావు, విజయలక్ష్మి, రాంబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఘనంగా బతుకమ్మ, దసరా పండుగ ఉత్సవాలు



మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో స్టేట్ హ్యాం డ్లూమ్ ఎక్స్పో, బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కిరణ్మయి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుం ది. ఈ సందర్భంగా మూషిక వాహన, శ్రీ విఘ్నరాజం, భజేయ, రామరామ జతిస్వరం, పుష్పాంజలి, పరమ పురుషుడు, కొలువైతివా, బో శంభో, వినా యక కౌతం, తీరు తీరు. జవరాల, జనుత శబ్దం, ముద్దుగారేయ్ యశోధ, కృష్ణంకలయసఖి తదితర అంశాలను కళాకారులు స్నేహా, వర్షిత, శ్రీలత, నిత్యశ్రీ, కార్తిక, అనఘా, రుషిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు. రేపటి నుంచి శిల్పారామంలో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, ఆసక్తిగల మహిళలు పాల్గొనాలని కోరారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, అక్టోబర్ 13 ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని నోబుల్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ రెడ్డిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లోని నోబుల్ కళాశాలలో నిర్వ హించిన స్వాగతోత్సవ్-2023కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత లక్ష్య సాధనకోసం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడం తోపాటు అన్నిఅంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యా ర్థులు ప్రదర్శించిన బతుకమ్మలతోపాటు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమా లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కరరావు, ఇంఛార్జి వెంకటేష్, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనా న్నరు.

## ఈ నెల 16న బడంగ్‌పేట్‌లో రాజ్‌నాథ్‌సింగ్ సభ

**సరూర్‌నగర్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన బడంగ్‌పేట్ మున్సిపల్ మైదానంలో జరిగే కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాదర్‌గుల్‌లోని నియోజకవర్గ బిజెపి కార్యాలయంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్య క్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజ్‌నాథ్ సింగ్ రానున్నారనీ ఈ మేరకు ఆయనకు ఘన స్వాగతం పలికి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు నడికుడ యాదగిరి, తర్రె మల్లేష్ యాదవ్, గడ్డం వెంకటేష్, జిల్లా నాయకులు మద్ది రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సాయికుటీర్‌లో నేడు ఈ-కేవైసీ ప్రక్రియ ప్రత్యేక శిబిరం

**హయత్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల పరిమితిని 2నుంచి 5లక్షలవరకు పెంచిన నేపథ్యంలో లబ్ధిదారులు ఈ-కేవైసీ ప్రక్రియను వెంటనే పూర్తిచేసుకోవాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి సూచించారు. వార్డు పరిధిలోని లబ్ధిదారులు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునేందుకు లక్ష్మారెడ్డిపాలెంలోని సాయికుటీర్ కమ్యూనిటీ హాలులో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, దానికి లింకయిన సెల్‌ఫోన్‌తో హాజరు కావాలన్నారు.

## ఎమ్మెల్యే మైనంపల్లి సమక్షంలో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంతోష్ ముదిరాజ్..

**నేరెడ్‌మెట్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. సీనియర్ నాయకులు సంతోష్ ముదిరాజ్ మైనంపల్లి హన్మంత్‌రావు సమక్షం లో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదని, ప్రజలను ప్రలోభాలకు గురి పెట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, మీనాకుమారి, పిట్ల శ్రీనివాస్, బాలరాజు, పిట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులతో ఉప్పల్ కమిషనర్ సమీక్ష



ఉప్పల్‌లో నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిసి శ్రీనివాస్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పా ట్లపై నోడల్ అధికారులతో శుక్రవారం ఈఆర్ఓ, ఉప్పల్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో నోడల్ అధికారులు తీసుకోవాల్సి న జాగ్రత్తలు, ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి అధికారులకు తగు సూచ నలు చేశారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నోడల్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



బచ్‌పన్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ కల్పవల్లి, విద్యార్థులు తదితరులు

వనస్థలిపురం డిపిఎస్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు.. ప్రిన్సిపల్ రజిని ఉపాధ్యాయులు సిబ్బంది (ప్రభాతవార్త, వనస్థలిపురం)